# ప్రతిక్షణం ప్రతిపక్షానిదే!

## తొలి రోజు చర్చ ఉత్కంఠభరితం ❑ చివర్లో కీలక మలుపు ❑ ఇరుకునపడ్డ సర్కారు

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన ప్రధాన ప్రతిపక్షంపై ఎదురుదాడి చేయాలనుకున్న పాలకపక్షం బోర్లాపడింది. తమకున్న సంఖ్యా బలంతో ప్రతిపక్షాన్ని తేలిగ్గా నోరుమూయించొచ్చనుకున్న అధికారపార్టీ ఎత్తుగడ పారలేదు. ఆద్యంతం పరస్పర ఆరోపణలతో సాగిన 'అవిశ్వాసం' చర్చలో ప్రతిపక్ష తెదేపాదే పైచేయి అయింది.

శాసనసభలోని 294మంది ఎమ్మెల్యేల ఆస్తులపై విచారణకు ప్రభుత్వాన్ని ఒప్పించడం ద్వారా తెలుగుదేశం తాననుకున్నది సాధించగలిగింది. ప్రస్తుత న్యాయమూర్తితో 1978నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల ఆస్తులపై విచారణకోసం మంగళవారం శాసనసభ తీర్మానం చేయనుంది. అయితే ఇంత పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధుల ఆస్తులపై విచారణకు న్యాయస్థానం ఒప్పుకుంటుందా అనేది సందేహంగానే ఉంది. ఇంత కాలం సాగుతున్న పరస్పర ఆరోపణల మాదరిగానే ఇది కూడా వాగాడంబరంగానే మిగిలిపోతుందా? అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. మొత్తంమీద అవిశ్వాసం చర్చ మలుపులు తిరిగి అవినీతి చుట్టూనే తిరిగింది. వాస్తవానికి గత వారంలోనే సభలో రెండురోజులపాటు అవినీతిపై ప్రత్యేకంగా చర్చ జరగాల్సి ఉంది. స్పీకర్ సమక్షంలోనే ఈచర్చకు అన్ని పార్టీలు అంగీకరించాయి. తరువాత ఏంజరిగిందోకాని ఇటు తెదేపాకాని, అటు కాంగ్రెస్ కాని గత గురు, శుక్రవారాల్లో అవినీతిపై చర్చకు పట్టుబట్టలేదు. రెండు ప్రధాన పార్టీలు మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకున్నాయంటూ ఇతర పక్షాలు విమర్శించాయి. ఈపరిస్థితుల్లో సోమవారం అవిశ్వాస తీర్మానంపై చర్చను తెదేపా సీరియస్‌గా తీసుకుంది. తీర్మానంపై తొలిరోజు చర్చ సాగిన తీరు ఉత్కంఠభరిత ట్వంటీ ట్వంటీ క్రికెట్ మ్యాచ్‌ను తలపింపజేసింది. ఈ చర్చను సోమవారం ఉదయం 8.30కు ప్రతిపక్షనేత చంద్రబాబు ప్రారంభించారు. దాదాపు మూడుగంటలపాటు మాట్లాడిన బాబు ప్రసంగం పదునుగా సాగింది. నాలుగేళ్ల వైఎస్ పాలనలో వైఫల్యాలను, వాగ్దానభంగాలను ఒక్కొక్కటిగా ప్రతిపక్షనేత ప్రస్తావిస్తూ... ప్రభుత్వాన్ని ఇబ్బందిపెట్టేందుకు యత్నించారు. వైఎస్ పాలనలో వెలుగుచూసిన కుంభకోణాలను సాక్ష్యాధారాలతో సభ ముందు ఉంచే ప్రయత్నం చేశారు. ఆ క్రమంలో... సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో అధికారపార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు బినామీ పేర్లతో పనులు చేస్తున్నారని బాబు చేసిన ఆరోపణలు సభలో పెద్దఎత్తున కలకలాన్ని రేపాయి. ఈ అంశం గంటకు పైగా సభా కార్యకలాపాల్లో ప్రతిష్ఠంభనకు కారణమైంది.

**ఎత్తుకు పైఎత్తు:** చంద్రబాబు చేసిన ఆరోపణలతో ఆగ్రహంగా ఉన్న పాలకపక్షం వాటికి సమాధానం చేప్పే విషయాన్ని పక్కనపెట్టి బాబుపై ఎదురుదాడికి దిగింది. ఎన్టీఆర్ ట్రస్టు నిధుల విషయంలో చంద్రబాబును ఇరుకునపెట్టేందుకు కాంగ్రెస్ పన్నిన వ్యూహం బెడిసి కొట్టింది. చంద్రబాబు తనపై వచ్చిన ఆరోపణలను సమర్థంగా తిప్పికొట్టడంతో అధికారపక్షం బిత్తరపోయింది. ఎన్టీఆర్ ట్రస్టు నిధులపై చీఫ్ విప్ కిరణ్‌కుమార్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు సంధించారు. "ఎన్టీఆర్ ట్రస్టు లావాదేవీలు, నిధులకు సంబంధించిన ఫైళ్లన్నింటినీ స్పీకర్ ఎదుట పెడతాం. మేం తప్పు చేశామనిపిస్తే... ఏ చర్య అయినా తీసుకోండి. ప్రభుత్వ అవినీతిపై మేం చేసిన ఆరోపణలకు సంబంధించిన ఫైళ్లన్నింటినీ స్పీకర్ ఎదుట పెట్టే దమ్ము మీకుందా?" అని ప్రతిపక్షనేత ప్రతిస్పందించిన తీరు పాలక పక్షాన్ని, ముఖ్యంగా వైఎస్‌ను ఆత్మరక్షణలో పడేసింది. ఆనక తెదే సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి ప్రసంగిస్తూ... ఎమ్మెల్యేలందరి ఆస్తులపై న్యాయవిచారణకు సర్కారును ఒప్పించగలిగారు. తద్వారా తమ లక్ష్యం నెరవేరిందన్న అభిప్రాయం తెదేపాలో వ్యక్తమవుతోంది.

**వ్యూహాత్మక అడుగులు:** ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి, ప్రతిపక్షనేత చంద్రబాబుల ఆస్తులపై చర్చ జరగడం... వారిరువురూ ఒకరిపై ఒకరు సవాళ్లు విసురుకోవడం అసెంబ్లీకి కొత్తకాదు. అసెంబ్లీ మునపటి సమావేశాల్లోనూ వీరిద్దరూ తమ తమ ఆస్తులపై వాగ్బాణాలు సంధించుకున్నారు. పరస్పర సవాళ్లూ చేసుకున్నారు. శుక్రవారం సభలో ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా... వైఎస్ భూకబ్జాకు పాల్పడ్డారంటూ బాబు విమర్శించడం, దీనిపై సీఎం ఘాటుగా స్పందిస్తూ... ప్రతిపక్షనేతకే అక్రమ ఆస్తులున్నాయంటూ ఎదురుదాడికి దిగడం విదితమే. ఆ వెంటనే చంద్రబాబు "మీ ఆస్తులు, నా ఆస్తులపై న్యాయ విచారణకు సిద్ధమా?" అంటూ వైఎస్‌కు సవాలు విసిరారు. అయితే ఆరోజు వైఎస్ ఈవిషయంలో స్పందించలేదు. దానికి కొనసాగింపా? ... అన్న రీతిలో సోమవారం సభలో మళ్లీ ఆస్తుల వ్యవహారం వేడి పుట్టించింది. ప్రభుత్వ అవినీతిపై మొదలైన చర్చ కాస్తా ఎమ్మెల్యేలందరి ఆస్తులపై న్యాయవిచారణకు దారితీసింది. మొత్తానికి వైఎస్ సర్కారుపై తాము ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం పరంగా అసెంబ్లీలో సోమవారం జరిగిన చర్చ పట్ల తెదే సంతృప్తిగా ఉంది. తొలిరోజు చర్చలో తమదే పైచేయి అయిందన్న అభిప్రాయం ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. అవినీతి ఆరోపణలను సాక్ష్యాధారాలతో సహా సభ ముందు ఉంచడం ద్వారా పాలకపక్షాన్ని తాము ఇరుకున పెట్టగలిగామన్నది తెదే నేతల భావన. "తొలుత మా అధినేత... తరువాత వేం నరేందర్‌రెడ్డి చాలా బాగా ప్రసంగించారు. ప్రభుత్వ అక్రమాలను ఒక్కొక్కటీ నిలదీస్తూ... సర్కారును ఎండగట్టిన రీతి బాగుంది. అందరు ఆస్తులపై సిట్టింగ్ జడ్జీతో విచారణకు సర్కారును మేం ఒప్పించగలగడం కచ్చితంగా మా విజయమే. మా నరేందర్‌రెడ్డిని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా చెప్పుకోవాలి" అని తెదే శాసనభాపక్ష ఉపనేత నాగం జనార్దనరెడ్డి ముక్తాయించారు.